> ప్రాజెక్టుల నిర్మాణంతో బీహెచ్ ఈఎల్‌కు, రైతుబీమా, చేనేత బీమా, గీతన్నకు బీమాతోపాటు రాబోయే ప్రభుత్వంలో 'ఇంటింటికీ బీమా- కేసీఆర్ ధీమా' వంటి వినూత్న పథకానికి బీమా ప్రీమియం ఎల్‌ఐసీకే చెల్లించి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడతాం. కాంగ్రెస్, బీజేపీలు అమ్మకం అయితే బీఆర్‌ఎస్ నమ్మకం.
>
> - మంత్రి హరీశ్‌రావు





తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం 44 కార్మిక సంఘాలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

# వేతనాలు రెట్టింపు చేసేది కేసీఆరే

## 100% వచ్చేది బీఆర్‌ఎస్ సర్కారే

- ఆర్పీలు, వీఏవోల వేతనాలు డబుల్
- ప్రభుత్వ ఉద్యోగులతో సమంగా ఆశా, అంగన్‌వాడీలకు పీఆర్సీ పెంపు
- ఆటో ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు
- కాంగ్రెస్, బీజేపీ మధ్య లోపాయికారి స్నేహం
- మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 3 తర్వాత ఏర్పడే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆర్పీలు, వీఏవోల వేతనాలు రెట్టింపు అవుతాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆశా, అంగన్‌వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పీఆర్ ఇస్తామని స్పష్టం చేశారు. మంగళవారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్‌కే ఆధ్వర్యంలో 44 కార్మిక సంఘాలతో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ సీఎం కేసీఆరేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను ఎదుర్కోలేక, కేసీఆర్‌ను తట్టుకోలేక కాంగ్రెస్, బీజేపీ రెండూ లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పొట్టకొడితే సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్మికుల కడుపులు నింపిందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జీతాలు పెంచాలని ధర్నా చేస్తే ఇనుప బూట్లు, గుర్రాలతో తొక్కించిన చరిత్ర కాంగ్రెస్ పాలకులదని గుర్తుచేశారు. కార్మికుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచిన చరిత్ర బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు, సఫాయి కార్మికులు, హోంగార్డులు, చిరు ఉద్యోగులను అక్కున చేర్చుకొని వారి జీవితాలను బాగుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఇప్పటికే వీఏవోల వేతనాలను పెంచామని, మూడోసారి అధికారంలోకి వచ్చాక వారి వేతనాలను రెట్టింపు చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి 11 సార్లు అవకాశం ఇస్తే మంచినీళ్ల సమస్యను పరిష్కరించుకుండా కన్నీళ్లను మిగిల్చిన దుర్భర చరిత్ర కాంగ్రెస్ పార్టీది కాదా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల నీటి కష్టాలను మిషన్ భగీరథతో తీర్చామని తెలిపారు.

### ఢిల్లీలో కొట్టుకుని గల్లీలో కలిసుంటాయి

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీలో కొట్టుకుని గల్లీలో కలిసి ఉంటాయని మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ సిద్ధించిందని సంబరాలు చేసుకుంటుండగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాలను ఏపీలో కలిపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీలేరు పవర్ ప్రాజెక్టు దక్కకుండా చేశారని విమర్శించారు. బీజేపీ బిల్లు పెడితే కాంగ్రెస్ మద్దతిచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట బీజేపీ, ఆ పార్టీ బలంగా ఉన్న చోట కాంగ్రెస్ మద్దతు ఇచ్చి పుచ్చుకుంటున్నాయని ఆరోపించారు. ఇందుకు దుబ్బాక, హుజూరాబాద్, నాగార్జున సాగర్, మునుగోడు ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమని వివరించారు.

> కరువు, కర్ఫ్యూ కాంగ్రెస్‌కు పుట్టిన కవలలు. హింసా రాజకీయాలు, కర్ఫ్యూ వాతావరణ సృష్టికి కాంగ్రెస్ పెట్టింది పేరు. కరువు నేలలో సిరులు కురిపించిన దార్శనికుడు సీఎం కేసీఆర్.
>
> - మంత్రి హరీశ్‌రావు

### ఆడబిడ్డలను అక్కున చేర్చుకున్నది బీఆర్‌ఎస్సే

రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్కున చేర్చుకున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, ఆరోగ్య లక్ష్మి, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి వాహనాలు, షీటీమ్స్ ఇలా అనేక విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టి రాష్ట్రంలో మహిళాభ్యుదయానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారని కొనియాడారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వీఏవోలు, ఆర్పీల వేతనాలు పెంచి వారి సేవలను సమున్నతంగా గౌరవించిదని తెలిపారు. రాష్ట్రంలోని 26వేల వీఏవోలు, ఆర్పీల గౌరవ వేతనాలను ఇప్పటికే పెంచామని, డిసెంబర్ 3 తరువాత ఏర్పడబోయే బీఆర్‌ఎస్ సర్కారు వారి వేతనాలను రెట్టింపు చేస్తుందని హామీ ఇచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్‌లో చిరు ఉద్యోగులకు తెలంగాణలో ఇస్తున్న వేతనాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా? అని ప్రశ్నించారు.

### ఉపాధి మింగిన కాంగ్రెస్‌కు ఓటెయ్యాలా?

కాంగ్రెస్ హయాంలో కరెంటు లేక అన్ని రంగాలు కుదేలయ్యాయని మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. కరెంటు లేక ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, పరిశ్రమలు మూతపడడంతో లక్షలాదిమంది కార్మికులు వలసలు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి మింగిన కాంగ్రెస్‌కు ఓటెయ్యాలా? అని నిలదీశారు. పరిశ్రమలకు వారంలో రెండు రోజుల పవర్ హాలీడే ఇచ్చిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని మండిపడ్డారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత కరెంట్ కష్టాలు దూరమయ్యాయని వివరించారు.

### ట్రాన్స్‌పోర్టు బోర్డు ఏర్పాటు చేస్తాం

ఆటో కార్మికులకు త్రైమాసిక పన్నును రద్దు చేసింది సీఎం కేసీఆరేనని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ట్రాక్టర్లకు పన్ను రద్దు చేసింది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. ఆటో, రవాణా కార్మికుల ట్రాన్స్‌పోర్ట్ బోర్డు ఏర్పాటు డిమాండ్‌ను మూడోసారి అధికారంలోకి రాగానే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ముందు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తేలిపోయాని ఎద్దేవా చేశారు. బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుంటే వాటిని కాపాడడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని కూడా అమ్మేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసిందని తెలిపారు. మాట తప్పే కాంగ్రెస్ కావాలా?.. మాట మీద నిలబడే కేసీఆర్ కావాలా? అంటే తెలంగాణ ప్రజలు మాట మీద నిలబడే కేసీఆర్‌వైపు ఉంటారని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ఏకైక ఇంటి పార్టీ బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. వచ్చే జనవరి నుంచి అన్నపూర్ణ పథకంతో సన్నబియ్యం పంపిణీ చేస్తామని మంత్రి హరీశ్‌రావు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌కే అధ్యక్షుడు రాంబాబుయాదవ్, సంఘం నాయకులు రూప్‌సింగ్, నారాయణ, దానకర్ణాచారి, మారయ్య, హనుమాండ్లు, మాధవి, సునీత, నిర్మల, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ కుర్మ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌కే మా మద్దతు

**మంత్రి హరీశ్‌రావుకు జమాతే -ఇ- అహ్లే సన్నత్ తీర్మాన కాపీ అందజేత**

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): మతసామరస్యానికి, పరమత ప్రేమకు, లౌకికత్వానికి ప్రతీకగా ఉన్న బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు జమాతే-ఇ-అహ్లే సన్నత్ రాష్ట్రశాఖ ప్రకటించింది. మంగళవారం సంస్థ ప్రతినిధులు, ఇస్లామిక్ పండితులు, ఇమామ్‌లు, వివిధ దర్గాల ఖాన్‌ఖాలతో కూడిన జమాత్ మంత్రి హరీశ్‌ను కలిసి మద్దతు ప్రతిని అందించింది. ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తున్నందుకే బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ తెలంగాణలో మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్ దేశంలోని మరే రాష్ట్రంలో లేదని తెలిపారు. షాదీముబారక్ పథకం ద్వారా మైనారిటీ ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అధికమొత్తంలో ఖర్చు చేస్తున్నదని వివరించారు. గంగా జమున తెహజీబ్‌కు అచ్చమైన నిర్వచనం తెలంగాణ అని తెలిపారు. గత పదేండ్లలో రాష్ట్రంలో మతం పేరుతో అల్లర్లు జరగలేదని, శాంతిసామరస్యాలతో తెలంగాణ ఫరిడవిల్లుతున్నదని మంత్రి పేర్కొన్నారు.




మంత్రి హరీశ్‌రావుకు తీర్మానకాపీ అందజేస్తున్న ముస్లిం మతపెద్దలు

# నాగజ్యోతిని దీవించిన 'కల్యాణలక్ష్మి' కుటుంబం

ములుగు, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి, అనుచరులతో కలిసి ములుగు మండలం భాగ్యతండాకు చేరుకున్నారు. ఇంటింటి ప్రచారం లో కల్యాణలక్ష్మి పథకానికి ఆద్యులైన కీమానాయక్-రుక్కమ్మ ఇంటికి చేరుకున్నారు. వారు నాగజ్యోతిని ఇంట్లోకి ఆహ్వానించి చీరె, సారె అందించి దీవించారు. నాగజ్యోతి తన వెంట వచ్చిన వారితోపాటు కీమానాయక్ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కీమానాయక్ మాట్లాడుతూ.. నాడు ఉద్యమ నేతగా 20 ఏండ్ల కింద కేసీఆర్ వచ్చి తన కూతురు కల్పన పెండ్లిని సొంత ఖర్చులతో చేసి దీవించారని గుర్తుచేశారు. రెండేండ్ల క్రితం సీఎం హోదా లో తన మనుమరాలు చంద్రకళ పెండ్లి చేయించే బాధ్యతను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి అప్పగించి ఘనంగా జరిగేలా చేశారని కొనియాడారు. ఉద్యమ సమయంలో ఆడపిల్ల పెండ్లి కష్టాన్ని తెలుసుకున్న కేసీఆర్ సీఎం అయ్యాక కల్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని మెచ్చుకున్నారు. కల్పన మాట్లాడుతూ తండ్రి తర్వాత తండ్రిగా తనకు పెండ్లి చేసిన కేసీఆర్ సీఎం అయిన తర్వాత ఏ ఆడబిడ్డకు ఇలాంటి కష్టం రావద్దని కల్యాణలక్ష్మి కింద 1,00,116ను అందించడం గొప్పవిషయమని కొనియాడారు.



బడే నాగజ్యోతికి చీరె పెడుతున్న కల్పన-యాకు, కీమానాయక్- రుక్కమ్మ

# విద్యాసాగర్‌రావు సేవలు స్ఫూర్తిదాయకం

- ఘనంగా తెలంగాణ ఇరిగేషన్ డే
- ఆరుగురు ఇంజినీర్లకు పురస్కారాలు

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర నీటిపారుదల రంగ మాజీ సలహాదారు, కేంద్ర జల సంఘం మాజీ చీఫ్ ఇంజినీర్ దివంగత ఆర్ విద్యాసాగర్‌రావు చేసిన సేవలు ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకమని వక్తలు పేర్కొన్నారు. విద్యాసాగర్‌రావు 84వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ ఇరిగేషన్ డే నిర్వహించారు. సాగునీటి పారుదల రంగంలో విశేష కృషిచేసిన ఆరుగురు ఇంజినీర్లకు పురస్కారాలు అందజేశారు. అనిల్‌కుమార్, ఈఎన్సీ (పరిపాలన), వీరబొమ్మ అజయ్‌కుమార్ (సీఈ, నల్లగొండ), ఎస్ భీమ్‌ప్రసాద్ (ఎస్‌ఈ-జాయింట్ సెక్రటరీ), శ్రీనివాస్‌రెడ్డి (ఈఈ, సిరిసిల్ల), శైలజ (డీఈఈ, కొండమల్లేపల్లి), స్నేహ (ఏఈఈ, మహబూబ్ నగర్) పురస్కారాలు అందుకున్నారు. సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే అనువదించిన 'భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య వృత్తిగత చరిత్ర-నా వృత్తి జీవితం: అనుభవాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేంద్ర నీటిపారుదల జల విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల అనుమతుల కమిటీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ పీజీశాస్త్రి, విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు మేరెడ్డి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కర్ణాటక చైర్మన్ నాగరాజ్, తెలంగాణ చైర్మన్ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.



మెండోరా మండలం ఎల్కటూర్‌లో మంత్రి వేములను సన్మానిస్తున్న గ్రామస్థులు

# కాంగ్రెస్ దొంగ మాటలు నమ్మొద్దు : మంత్రి వేముల

మెండోరా, నవంబర్ 14: 'కాంగ్రెస్‌కు ఓటు.. 24 గంటల కరెంట్‌కు చేటు' అని మంత్రి, బీఆర్‌ఎస్ బాల్కొండ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కర్ణాటకలో ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వ్యవసాయానికి సరిగ్గా కరెంట్ ఇవ్వలేక రైతులతో నిరసనలు ఎదుర్కొంటున్నదని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే తెలంగాణలో కూడా మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవని హెచ్చరించారు.



కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లో మంత్రి గంగులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

# కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే వెళ్లేది ఢిల్లీకే

**బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల**

కరీంనగర్ కార్పొరేషన్/ కొత్తపల్లి, నవంబర్ 14 : 'ఆంధ్రా నాయకులు ఢిల్లీ పార్టీలతో కుమ్మక్కై పచ్చగా ఉన్న తెలంగాణను మళ్లీ దోచుకునేందుకు సిద్ధమయ్యారు. జాగ్రత్తగా ఉండాలి' అని కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాలతోపాటు పలు డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గంగుల మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే ఢిల్లీకి వెళ్తాయని చెప్పారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనులు, తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను నాలుగోసారి విజయం అందించనున్నాయని ధీమా వ్యక్తం చేశారు.



హాలియాలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వెల్లువలా తరలివచ్చిన జనం

# పాలకుర్తి జన ప్రభంజనం

## తొర్రూరులో ప్రజా ఆశీర్వాద సభ సూపర్‌హిట్

- హాలియా జనసాగరం.. ఇబ్రహీంపట్నం గులాబీమయం
- కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలకు పోటెత్తిన జనం
- స్వచ్ఛందంగా తరలివచ్చిన అన్నివర్గాల ప్రజలు
- అభివృద్ధి, సంక్షేమానికి ముక్తకంఠంతో సంఘీభావం
- కళాకారుల ఆటపాటలకు ఊర్రూతలూగిన శ్రేణులు

వరంగల్/నల్లగొండ, నవంబర్14(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఇబ్రహీంపట్నం: తొర్రూరులో ఇసుకేస్తే రాలనంత జనం.. దిక్కులు పిక్కటిల్లేలా నినాదాల ప్రభంజనం.. రోడ్లపై పరుచుకున్న గులాబీవనం.. ఇదీ పాలకుర్తి నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభకు ప్రజలు పోటెత్తిన వైనం.. తొర్రూరులోని మహబూబాబాద్ రోడ్డులో 200 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించిన ఈ సభకు వచ్చిన జనంతో సభాప్రాంగణంతోపాటు ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి మొత్తం కిలోమీటర్లకొద్దీ ప్రజలతో నిండిపోయింది. వేలాది ట్రాక్టర్లలో రైతులు ఈ సభకు తరలివచ్చారు. తండోపతండాలుగా జనం తరలివస్తుంటే రోడ్లన్నీ చీమలదండును తలపించింది. భారీ సంఖ్యలో వచ్చిన జనంతో తొర్రూరు పట్టణం, శివారు ప్రాంతాలు కిటకిటలాడాయి. జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. బీఆర్‌ఎస్ శ్రేణుల ఈలలు, కేరింతలతో పట్టణం దద్దరిల్లింది. హుషారెత్తించే పాటలతో పోటెత్తే దరువులతో ప్రజలు నృత్యాలు చేసూ ఊర్రూతలూగారు. సభలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ వివరిస్తున్నప్పుడు జనం ఈలలు, చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. యాంకర్, కళాకారుడు బిత్తిరి సత్తి, ఇతర కళాకారులు పాటలతో జనంలో మరింత జోష్ నింపారు. గులాబీ జెండలే రామక పాట అందరిలో ఊపు తెచ్చింది. తొర్రూరుతోపాటు నాగార్జున సాగర్ నియోజకవర్గం హాలియాలో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఖానాపూర్‌గేటు వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజాఆశీర్వాద బహిరంగసభలు విజయవంతమయ్యాయి. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, నోముల భగత్‌కుమార్, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఆయా సభలకు ఆటోలు, ట్రాలీలు, మోటరు సైకిళ్లపై ఊరూరా జనం స్వచ్ఛందంగా తరలివచ్చారు. మొత్తంగా సీఎం కేసీఆర్ పాల్గొన్న ప్రజాఆశీర్వాద సభలకు జనం పోటెత్తారు.

### ఇండ్లకు తాళాలేసి తరలొచ్చిన తండాలు

నల్లగొండ జిల్లా హాలియా పట్టణం ప్రజాఆశీర్వాద సభ సందర్భంగా జనసాగరాన్ని తలపించింది. ఎటుచూసినా గులాబీ సైన్యం బారులుదీరి కనిపించింది. నిడమనూరు, పెద్దవూర, సాగర్ నుంచి హాలియా వరకు ప్రధాన రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. కేసీఆర్ పట్ల కృతజ్ఞతతో గిరిజన తండాలన్నీ ఇండ్లకు తాళాలు వేసి సభకు కదలొచ్చాయి. రైతులంతా స్వచ్ఛందంగా సొంత ట్రాక్టర్లలో వచ్చారు. కళాకారుడు ఏపూరి సోమన్న కళా బృందం ప్రదర్శించిన ఆటపాటలకు జనం స్టెప్పులేస్తూ గొంతు కలపడంతో సభా ప్రాంగణమంతా హోరెత్తింది. సీఎం కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధిపై వివరించేటప్పుడు, విపక్షాల తీరును ఎత్తి చూపినప్పుడు, సాగర్ సమస్యలను ప్రస్తావించినప్పుడు సభా ప్రాంగణం పలుమార్లు చప్పట్లతో మార్మోగింది. ఏడెనిమిది నెలల్లో నెల్లికల్లు లిఫ్టును తానే వచ్చి ప్రారంభిస్తానని చెప్పగా గిరిజనులంతా ఈలలు, కేరింతలతో హర్షం వ్యక్తం చేశారు. రెండేండ్లలో ఉచిత కరెంటు ఇస్తే గులాబీ కండువా కప్పుకొంటానన్న జానారెడ్డి.. ఆ తర్వాత మాట తప్పాడని, పైగా భగత్‌పై ఉప ఎన్నికల్లో పోటీకి దిగాడని గుర్తు చేసినప్పుడు సభ ప్రాంగణం అరుపులతో దద్దరిల్లింది.

### ఖానాపూర్‌గేట్‌కు పోటెత్తిన జనం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఖానాపూర్‌గేట్ వద్ద జరిగిన ప్రజాఆశీర్వాదసభకు భారీ ఎత్తున ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివచ్చారు. నియోజకవర్గంలోని అన్ని ఊళ్ల నుంచి ఊహించిన దానికంటే ఎక్కువమంది వచ్చారు. సెంటిమెంట్ ప్రకారం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి గత ఎన్నికల ముందు కూడా ఇక్కడే బహిరంగసభ ఏర్పాటుచేసి సీఎం కేసీఆర్‌ను తీసుకువచ్చారు. ఈసారి కూడా అదే సెంటిమెంట్‌తో ఖానాపూర్‌గేటు వద్ద సభను ఏర్పాటుచేశారు. సీఎం ప్రసంగిస్తున్నంత సేపు జనహోరు మార్మోగింది. కేసీఆర్ మాటమాటకు చప్పట్లు, ఈలలు, కేరింతలు ప్రతిధ్వనించాయి. పథకాలు వల్లెవేసినప్పుడు చేతులెత్తి మద్దతు పలికారు.

# రేవంత్ వెనుక ఆర్‌ఎస్‌ఎస్

- కాంగ్రెస్‌ను నడిపిస్తున్నది ఆ సంస్థే
- కొడంగల్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఓడించాలి
- ఎంఐఎం లేనిచోట బీఆర్‌ఎస్‌ను గెలిపిద్దాం
- కేసీఆర్‌ను మూడోసారి గెలిపించండి
- ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ



వికారాబాద్‌లో నిర్వహించిన ఎంఐఎం సమావేశంలో ప్రసంగిస్తున్న ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ

వికారాబాద్, నవంబర్ 14, (నమస్తే తెలంగాణ): ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్ డైరెక్షన్‌లోనే కాంగ్రెస్ నడుస్తున్నదని, గాంధీభవన్‌లో కాంగ్రెస్ వ్యవహారాలన్నీ నడిపించేది ఆర్‌ఎస్‌ఎస్సేనని ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ విమర్శించారు. మంగళవారం వికారాబాద్‌లోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో ఎంఐఎం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి బతికి ఉన్నంతవరకు ఆర్‌ఎస్‌ఎస్‌తోనే ఉంటారని, ఆయనను కాంగ్రెస్‌లోకి పంపింది ఆ సంస్థేనని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఏజెంట్ అయిన రేవంత్‌ను కొడంగల్‌లో చిత్తుగా ఓడించాలని ఎంఐఎం శ్రేణులకు పిలుపునిచ్చారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు ఇప్పుడు పశ్చాత్తాప పడుతున్నారని, పోటీ పరీక్షలకు బుర్ఖా ధరించి హాజరుకావద్దని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ తొమ్మిదన్నరేండ్లలో తెలంగాణలో బుర్ఖా ధరించి పరీక్షలకు వెళ్తే ఎవరైనా అడ్డుకున్నారా అనేది ఆలోచించాలని కోరారు. తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతున్నదని, రాష్ట్రం సస్యశ్యామలంగా, ప్రశాంతంగా ఉండాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతిచ్చి సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మూడోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధిని చూసి డిసెంబర్ 30న ఆలోచించి ఓటేయాలని సూచించారు. తొమ్మిదిన్నరేండ్లలో షాదీ ముబారక్ కింద రూ.2,340 కోట్ల నిధులిచ్చారని, 205 మైనార్టీ గురుకుల పాఠశాలలను ఏర్పాటుచేశారని తెలిపారు. 14 లక్షల మంది విద్యార్థులకు రూ.474 కోట్ల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. సీఎం ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 3,224 మంది ముస్లింలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేసిందని వెల్లడించారు. గోషామహల్‌లో బీజేపీకి మద్దతిస్తున్నది కాంగ్రెస్సేనని ఆరోపించారు. వయనాడ్‌లో రాహుల్‌గాంధీ పోటీ చేస్తే ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తానని తెలిపారు.



వర్ని మండలం జాకోరాలో స్పీకర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

# మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి

**బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం**

వర్ని, నవంబర్ 14: నియోజకవర్గ ప్రజల సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరించానని.. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. డబ్బు కోసమే కొందరు బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోవడంతో ఓటమి పాలైన ఏనుగు రవీందర్‌రెడ్డి.. బాన్సువాడలో ఏం చేస్తారని ప్రశ్నించారు. ప్రచారంలో పోచారం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.